క్లుప్తంగా

నేత్ర పర్వం.. గౌరీ పరమేశ్వరుల కల్యాణం



గౌరీపరమేశ్వరుల కల్యాణంలో పాల్గొన్న జంటలు

మల్కాపురం: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని గౌరీదేవి ఆలయంలో శుక్రవారం సాయంత్రం గౌరీపరమేశ్వరుల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను 15 రోజులుగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో పలు జంటలు పాల్గొన్నాయి. వేదపండితులు కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభినందన

మల్కాపురం: రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జీవీఎంసీ 59వ వార్డుకు చెందిన రామ్మోహన్‌నాయుడిని ఎమ్మెల్యే పి.గణబాబు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్'పై ప్రధాని ప్రకటన చేయాలని ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులకు రెండు నెలల నుంచి పూర్తిగా జీతాలు చెల్లించలేదన్నారు. ఫలితంగా కార్మికులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులు కుటుంబాలతో సహా రోడ్లపైకి వచ్చి నిరసనలు చేస్తున్నా యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. ఈఎంఐలు కట్టలేక ఉద్యోగులు ఏదైనా చేసుకుంటే ఎవరు బాధ్యత తీసుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఉన్నతాధికారులు మాత్రం ఒకటో తేదీన జీతాలు తీసుకుంటూ కార్మికులను ఇబ్బంది పెట్టడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. 29న విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీతో ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటన చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వై.టి. దాస్, యు. రామస్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో నిందితులకు రిమాండ్

ఎంవీపీకాలనీ: అప్పుఘర్ లుంబినీ పార్కు వద్ద బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడిన నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. ఎంవీపీ కాలనీ క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. కొత్తవలస, తుని ప్రాంతాలకు చెందిన డి.బాలమురళీకృష్ణ, శ్రీనివాసరావులపై లుంబినీ పార్కు వద్ద వాసుపల్లి నవీన్, కొమర సోమరాజు, గరికిన ఎల్లాజీ, ఎద్దు రాజులు దాడి చేసి, వారి నుంచి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. పోలీసులు బాధితులను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వారి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి, గురువారం రాత్రి ఏఎస్ రాజా సర్కిల్ వద్ద అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించారు. వారికి కోర్టు రిమాండ్ విధించింది. వారి నుంచి రూ.320తోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



గోపాలపట్నం పశువుల ఆస్పత్రి



సంచార వాహనం

పశుగణన పక్కాగా..!

- శరవేగంగా సాగుతున్న గణన
- నగరంలో పెంపుడు జంతువులపై ఫోకస్
- పశ్చిమ నియోజకవర్గంలో ప్రత్యేక బృందాలు
- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ
- అక్కడికక్కడే యాప్‌లో నమోదు

ఇంటింటికీ సర్వే

జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగణన ప్రక్రియ సజావుగా సాగేలా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఆయా ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో వెటర్నరీ, పారావెటర్నరీ సిబ్బందిని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లుగా నియమించారు. వీరు ప్రతి ఇంటికి వెళ్లి ఆయా జంతువులు, పక్షుల వివరాలతోపాటు పెంపకందారుల సమాచారం కూడా సేకరిస్తున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో ఎన్యూమరేటర్లు సేకరించిన వివరాలను అక్కడికక్కడే దానిలో నమోదు చేస్తున్నారు.



గోపాలపట్నంలో సర్వే చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: మూగజీవాల లెక్క పక్కాగా తెలుసుకునేలా కేంద్ర పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ప్రతి ఐదేళ్లకోసారి పశు సంపదను లెక్కిస్తూ, వాటి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని గోపాలపట్నం, గాంధీగ్రామ్(సింధియా) పశువైద్యశాల పరిధిలో 21వ పశుగణన కార్యక్రమం శరవేగంగా కొనసాగుతోంది. ఆవులు, ఎద్దులు, గేదెలు, దున్నలు, జడల బర్రెలు, గొర్రెలు, మేకలు, పందులు, ఒంటెలు, గుర్రాలు, గాడిదలు, కుక్కలు, కుందేళ్లు, ఏనుగులు వంటి పెంపుడు జంతువులు, పశువులు, అదేవిధంగా నాటుకోళ్లు, పౌల్ట్రీ కోళ్లు, బాతులు, టర్కీ కోళ్లు, ఈము, నిప్పుకోడి (ఆస్ట్రిచ్) తదితర పక్షుల వివరాలను సైతం ప్రస్తుతం చేస్తున్న సర్వేలో గుర్తిస్తున్నారు.

పెంపుడు జంతువులపై ఫోకస్

పశ్చిమ నియోజకవర్గంలో పశువులతో పాటు, పెంపుడు జంతువులు ఎక్కువగా ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు గుర్తించారు. గోపాలపట్నం, గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రికి ప్రతీ రోజూ ఎక్కువగా పెంపుడు కుక్కలను వైద్యం కోసం తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో పెంపుడు జంతువుల లెక్క తీసేందుకు ప్రస్తుత సర్వే ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఎలాంటి పెంపుడు జంతువులు ఉన్నాయి, వాటిని పెంచే వారి వివరాలను కూడా యాప్‌లో నమోదు చేస్తున్నందున భవిష్యత్‌లో ఈ సర్వే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

సర్వేకు ప్రత్యేక బృందాలు

గోపాలపట్నం ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోకి వచ్చే 89,90,91,92,93 వార్డుల పరిధిలో 36,740 ఇళ్లను సందర్శించి, పశు పక్షాదులకు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందుకోసం ఐదుగురు ఎన్యూమరేటర్లకు బాధ్యతలు అప్పగించారు. ప్రతీ రోజూ వీరంతా ఇళ్లను సందర్శించి సర్వే చేస్తుండగా, ఈ మొత్తం ప్రక్రియను పశు సంవర్ధక శాఖ సహాయసంచాలకుడు డాక్టర్ రవికుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు 13,147 ఇళ్లలో సర్వే పూర్తి చేసి1,261 పశువులను గుర్తించారు. అదే విధంగా 224 పెంపుడు జంతువుల వివరాలు సేకరించారు. ఇదే రీతిన గాంధీ గ్రామ్ పశువైద్యశాల పరిధిలో కూడా సిబ్బంది సర్వేనిర్వహిస్తున్నారు.

సర్వేకు సహకరించాలి



పశుగణన సర్వే పక్కాగా సాగాలంటే ప్రజలు అన్ని విధాలా సహకరించాలి. అపార్టుమెంట్లలో వుండే వారు పశుగణన సిబ్బంది వచ్చినప్పుడు వారికి సహకరించి పూర్తి సమాచారం ఇవ్వాలి.2025 ఫిబ్రవరి 25 వరకు సర్వే కొనసాగుతుంది. ఆస్పత్రిలో రోజువారీ వైద్యానికి ఎటువంటి ఇబ్బంది లేకుండానే, సర్వేపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– డాక్టర్ రవికుమార్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు, గోపాలపట్నం

వీధి దీపాలకు గ్రహణం

ఫోకస్





జీవీఎంసీ 62వ వార్డు పరిధిలో ప్రకాష్‌నగర్, మల్కాపురం, 63వ వార్డు పరిధిలోని చింతల్లోవ, కాకరలోవ, యారాడ రోడ్డు వంటి ప్రాంతాల్లో 12 రోజుల నుంచి వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శీతాకాలం కావడంతో త్వరగా చీకటి పడుతుందని, పాములు తదితర విషసర్పాల సంచారం అధికంగా ఉండడంతో వీధుల్లో ప్రయాణించాలంటే భయమేస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై పలు మార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వెంటనే విద్యుత్ శాఖ,జీవీఎంసీ విద్యుత్ విభాగ అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. -సింధియా

జీవీఎంసీ షెల్టర్‌కు రేకుల షెడ్డునిర్మాణం



జీవీఎంసీ షెల్టర్‌లో భెల్ ప్రతినిధులు

విశాఖ విద్య: బుచ్చిరాజు పాలెం జీవీసీఎం షెల్టర్‌లో నిరాశ్రయులు భోజనం చేయడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న భెల్ సంస్థ ప్రతినిధులు రేకుల షెడ్డు నిర్మించారు. దీన్ని శుక్రవారం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జితేందర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర రెడ్డి సంఘం మహిళా ఉపాధ్యక్షురాలిగా వరలక్ష్మి



చుక్క వరలక్ష్మి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవాని పాలెం ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా నాయకురాలు చుక్క రలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం మహిళా ఉపాధ్యక్షురాలిగా నియమించినట్టు సంఘం ప్రతినిధులు ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి,సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సానం రెడ్డి సుహాసినిరెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన రెడ్డి సామాజిక వర్గం ప్రతినిధులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వరలక్ష్మిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ టెండర్లు రద్దు చేయాలి



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా హాస్పిటల్ ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారానికి 53వ రోజుకు చేరాయి. దీక్షల్లో సీఐటీయూ (పోర్ట్ వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్) నాయకులు దీక్షలో పాల్గొని, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు జక్కన సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు సంబంధించిన టెండర్లు పూర్తిగా రద్దు చేయాలని, పోర్టు హాస్పిటల్‌ను పోర్టు యాజమాన్యమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. టెండర్ల ప్రక్రియను నవంబరు 8న, 22న ప్రారంభించాలని చూశారని, ఇప్పుడు దానిని ఈ నెల 28వ తేదీకి వాయిదా వేశారని అన్నారు. వాయిదా వేయడం కాదు, టెండర్లను కార్మికుల సంక్షేమం కోసం పూర్తిగా రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటువ్యక్తుల చేతుల్లో పెట్టడం వలన లాభాల కంటే నష్టాలే ఎక్కువని కాగ్ నివేదికల ద్వారా తెలుస్తుందన్నారు. పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణ నిర్ణయం పూర్తిగా ఉద్యోగుల హక్కులను, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను క్షీణింపచేసేదిగా ఉందని విమర్శించారు. అన్ని యూనియన్లు దీనిని తీవ్రంగా వ్యతిరేకించడంతో ఈ టెండర్ల ప్రక్రియను ఇప్పుడు నవంబరు 28వ తేదీకి వాయిదా వేశారని, ఎట్టి పరిస్థితుల్లోను తాము ఒప్పుకోబోమని స్పష్టం చేశారు కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, రెడ్డి, ఆర్.ఎన్.మూర్తి, రాఘవులు, శ్రీనివాసు, కనకరాజు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫైబర్‌నెట్ బాక్సుల కొరత ఉంది

ఏపీఎస్‌ఎఫ్ఎల్ చైర్మన్ జీవీ రెడ్డి

విశాఖ విద్య: ఏపీ ఫైబర్‌నెట్‌లో బాక్సుల కొరత ఉందని, దీన్ని త్వరలోనే అధిగమిస్తామని ఏపీఎస్‌ఎఫ్ఎల్ చైర్మన్ జీవీ రెడ్డి అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీలోని ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ ఆపరేషన్ సెంటర్‌ను శుక్రవారం జీవీ రెడ్డి సందర్శించారు. ఫైబర్ నెట్ ఉద్యోగులతో సాంకేతిక విషయాలపై చర్చించారు. ప్రస్తుతం నెలకొన్న సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బాక్సుల కొరత ఉందని, త్వరలోనే ఆపరేటర్ల అందరికీ ఫైబర్ నెట్ బాక్సులను అందిస్తామన్నారు. ఈ విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

జీతాలు చెల్లించాలని కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన



కోరమాండల్ వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న జె.వి.సత్యనారాయణ

మల్కాపురం: కోరమాండల్ పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం దారుణం అని విశాఖ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.వి.సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోరమాండల్ గేటు వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ యాజమాన్యం,యూనియన్‌కు మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. అయినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

కార్మికులకు పని ప్రదేశంలో భద్రత లేదని, మౌలిక **వసతులు** కల్పించడం లేదని ఆరోపించారు. ప్రతి **సీనియర్** కాంట్రాక్ట్ కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుడాల రాంబాబు,శంకరరావు,శేఖర్,సత్యనారాయణరెడ్డి,ప్రకాష్,నూనెల సూరిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలి



ఎన్ఏడీ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఎన్ఏడీ ముందు కార్మికుల ధర్నా

విశాఖ విద్య: నేవల్ ఆర్మ్‌డ్ డిపో (ఎన్ఏడీ)లో పని చేస్తున్న 36 మంది కార్మికులను యాజమాన్యం సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ప్రధాన గేటు కార్మికులు ఆందోళన చేపట్టారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీనివాస్ మాట్లాడుతూ యాజమాన్యం నిర్ణయం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా ఎన్ఏడీలో కార్మికులు చేసిన పనికి ఓటీ ఇవ్వబోమని మొండికేసి సమస్యను సృష్టించింది సీజీఎం అని ఆరోపించారు. ఎన్ఏడీలో కింద స్థాయి అధికారుల నుంచి జనరల్ మేనేజర్ వరకు 30 ఏళ్లగా వస్తున్న ఆనవాయితీని కొనసాగించాలని యూనియన్ తరఫున వేడుకున్నా సీజీఎం నిరాకరించారన్నారు. చట్టానికి భిన్నంగా రాత్రి 8 గంటల తర్వాత, శని, ఆదివారాలు ఓటీ చేయాలని సీజీఎం ఒత్తిడి చేయడంతో కార్మికులు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. సీజీఎం చేష్టలపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సస్పెన్షన్లు రద్దు చేయకపోతే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.

వామ్మో... పశువుల ఆస్పత్రి !

- పిచ్చిమొక్కలతో ప్రాంగణం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



ఆకతాయిలకు అడ్డాగా మారిన గాంధీగ్రామం పశువుల ఆస్పత్రి ప్రాంగణం



వీధికుక్కల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన బోనుల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

సింధియా: గాంధీగ్రామ్ పశువుల ఆస్పత్రి ప్రాంగణం ఆకతాయిలకు అడ్డాగా మారింది. పరిసరాలు అధ్వానంగా ఉండడంతో చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేశారు. ఆస్పత్రి ప్రాంగణంతో పాటు మార్కెట్ పరిసరాల్లోఆకతాయిలు చేరి మద్యం, గంజాయి తాగుతూ వికృత చేష్టలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో వీధికుక్కల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన బోనుల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి విష కీటకాలు చేరుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. ఇక మార్కెట్ పరిసరాల్లో మద్యం సేవించి మందుబాబులు అక్కడే సేద తీరతున్నారు. దీంతో మహిళలు మార్కెట్‌కు రావాలంటేభయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేయాలని, పోలీసులు దృష్టి సారించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.


'ఉక్కు'కు మద్దతుగా 24న ర్యాలీ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 24న గాజువాకలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం ఎల్ఎంఎం పార్కులో కార్మిక ర్యాలీ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం వల్ల కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించడం లేదన్నారు. ఈనెల 29 విశాఖ పర్యటనలో ప్రధాని మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపి వేస్తున్నామని ప్రకటన చేయాలన్న డిమాండ్‌తో ఆ రోజు పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు ర్యాలీ, అనంతరం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, నమ్మి రమణ, నాగరాజు, వంశీకృష్ణ, ఉరుకూటి అప్పారావు, గురునాథ్, వరహాలు, వేణు తదితరులు పాల్గొన్నారు.

26న ఏయూలో ఆవంత్స, ఆరుద్రల శత జయంత్యుత్సవం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా ఈ నెల 26న ఏయూ టీఎల్ఎన్ సభాహాల్‌లో ఆవంత్స సోమసుందర్, ఆరుద్రల శత జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమ ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ మహాకవులు ఆవంత్స, ఆరుద్ర శత జయంతి ఉత్సవ నిర్వహణకు యూనివర్సిటీ వేదిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్సవాలు జయప్రదానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు, అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సి.ఎస్.క్షేత్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ప్రదర్శనను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న సీఐటీయూ నేత కుమార్

మద్దిలపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26న దేశవ్యాప్తంగా చేపట్టనున్న నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెం ఆటోమోటివ్ వద్ద శుక్రవారం నిర్వహించిన ముఠా కలాసీల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తోందన్నారు.విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామన్న కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నా, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో బయటకు నెట్టేస్తున్నా చోద్యం చూస్తోందని విమర్శించారు. ఈ నెల 26న దొండపర్తి డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన జరుగుతుందని, కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారావు, మేస్త్రిలు రమణ, శ్రీను, రెడ్డి, నరసింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.